## విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

ముకరంపుర జూన్ 19: విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. విజిలెన్స్, ఏపీటీఎస్ కరీంనగర్ పోలీస్ స్టేషన్ సీఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన పూసల సాగర్ 2016లో తన ఇంటికి అక్రమంగా కరెంట్ వాడుకుంటుండగా విద్యుత్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్, పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, రూ. వెయ్యి జరిమానా విధించారు. తిరిగి 2017లో విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడగా అధికారుల ఫిర్యాదు మేరకు రెండో నేరం కింద విజిలెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి హేమంత్ కుమార్ విచారణలో నేరం రుజువైంది. నిందితుడికి రూ.26,320 జరిమానా లేదా మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని సీఐ తెలిపారు. ఎస్ఐలు నిరంజన్ రెడ్డి, నరేశ్, సిబ్బంది ఉన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కలెక్టరేట్, జూన్ 19: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సుదీర్ఘదూరం నుంచి తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే అర్జీదారులను ఇబ్బందులకు గురిచేయకుండా, వారి సమస్యలు విని పరిష్కార మార్గాలు చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా 195 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 21, కొత్తపల్లి తహసీల్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై 19, కరీంనగర్ రూరల్ తహసీల్ కార్యాలయంలో పెండింగ్ సమస్యలపై 12 ఫిర్యాదులు వచ్చాయి. మిగతా 143 ఇతర ప్రభుత్వ విభాగాలకు సంబంధించి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, సంయుక్త శిక్షణ కలెక్టర్ నవీన్ నికోలస్, శిక్షణ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టొప్పో, తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోడౌన్ పరిశీలన

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం ఈవీఎం యంత్రాలు, వీ ప్యాట్‌లు భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. గోడౌన్ వద్ద సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. ఇక్కడ వివిధ పార్టీల నాయకులు, అధికారులు ఉన్నారు.

## వక్ఫ్‌బోర్డు భూములు పరిరక్షించాలి

గంగాధర, జూన్ 19: గర్శకుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించాలని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు, గంగాధరలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శుక్రుద్దీన్, అధ్యక్షుడు నాసర్, ప్రధాన కార్యదర్శి నజీర్, ఉపాధ్యక్షుడు అల్లాబక్ష్, కోశాధికారి షరీఫ్, జాయింట్ సెక్రటరీ షాదిక్ పాల్గొన్నారు.

## నోట్ బుక్‌ల పంపిణీ

చొప్పదండి, జూన్ 19: గుమ్లాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పూర్వవిద్యార్థి రాయలేని కిరణ్‌కుమార్‌యాదవ్ రూ.2వేల విలువైన నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, నాయకులు అప్పిడి శ్యాంసుందర్‌రెడ్డి, బీసవేని రాజశేఖర్, రాజమౌళి, సంకరి మోహన్, శంకర్, దండవేని గంగాధర్, సందవేని రాయమల్లు, సత్యం, రాజేశం, తిరుపతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

రాంనగర్, జూన్ 19: బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం బక్రీద్ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, ముస్లిం, హిందూ మతపెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరీంనగర్ పరిధిలోని ఈద్గాల వద్ద పారిశుధ్య పనులు, లైటింగ్, మంచి నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఆవులను, అనారోగ్యంతో ఉన్న పశువులను వధించవద్దన్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామని, 24 గంటలు పని చేస్తాయని తెలిపారు. మున్సిపల్ ఆధ్వర్యంలో మంచినీటిని సరఫరా చేయాలన్నారు. పశువులను వధించే సెంటర్లకు బ్లీచింగ్ పౌడర్ సరఫరా చేయాలని, వ్యర్థాలను వెంట వెంటనే అక్కడి నుంచి తరలించాలన్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా ఏర్పాట్లు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆవులు, దూడలు, అనారోగ్యంతో ఉన్న పశువులను వధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంచనీయమైన ఘటనలు జరుగకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ, పండుగలను సోదరభావంతో జరుపుకోవాలన్నారు. అపోహలను సృష్టించే వాట్సాప్ మెసేజ్‌లను చూసి తొందర పడొద్దన్నారు. ఆవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ శ్రీనివాస్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి నరేందర్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మధుసూదన్, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం, హిందూ మత పెద్దలు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి, జూన్ 19: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి గాయపడి కరీంనగర్ దవాఖానలో చికిత్స పొందుతున్న చొప్పదండికి చెందిన కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ గొల్లపల్లి శ్రావణ్ కుమార్‌ను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. శ్రావణ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

కొత్తపల్లి, జూన్ 19: న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్–23 కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కరీంనగర్‌లోని ఆర్‌ఆర్ కరాటే అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు అకాడమీ చీఫ్ మాస్టర్ గౌరు రాజి రెడ్డి తెలిపారు. సాత్విక్, మృదుల్, రామ్‌చరణ్, సిద్ధార్థ్, ఆకాశ్, ఆర్యన్, రేశ్వంత్, లాస్యశ్రీ 2 బంగారు పతకాలు, 1 రజత, 7 కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను హైకోర్టు న్యాయమూర్తులు ఎంజీ ప్రియదర్శిని, అనుపమ చక్రవర్తి, కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ, సబ్ జడ్జి అరుణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, శ్రీధర్ అభినందించారు.

## ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

కరీంనగర్ రూరల్, జూన్ 19: దుర్శేడ్‌లో పద్మశాలీ సంఘ భవనం ప్రహరీ, సీసీ రోడు నిర్మాణ పనులను సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిమల్ల శ్రీకాంత్, ఆర్థిక కార్యదర్శి నంద్యాల తిరుపతి, ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు దూడ మల్లేశం, దుర్శేడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటేశం, యువజన సంఘం అధ్యక్షుడు బోగ రాజ్‌కుమార్, గౌడ నర్సయ్య, గౌడ వీరయ్య, పాలకవర్గ సభ్యులు, వేముల రాంచంద్రర్, వేముల ఆంజనేయులు, శ్రీను, సత్యం, పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి వెళ్లిన ఒగ్గుడోలు కళాకారులు

గంగాధర, జూన్ 19: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఆషాడ బోనాల వేడుకల్లో భాగంగా న్యూఢిల్లీలో ఒగ్గుడోలు ప్రదర్శన ఇవ్వడానికి తాడిజెర్రి గ్రామానికి చెందిన మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి సభ్యులు సోమవారం ఢిల్లీకి తరలివెళ్లారు. ఒగ్గు కళాకారులు ఈర్ల మహిపాల్, గుంట మహేందర్, ఈర్ల గణేశ్, అవురగొండ మహేశ్, గుంట శ్రీరాం, గుంట కొమురయ్య, ప్రశాంత్, వంశీ, గంగశంకర్, అనిల్, మహేశ్, మధు, కుమార్, విజయ్, మహిత్, అనిల్, రామ్, సుమంత్ ఉన్నారు.

## బోర్‌వెల్ పనులు ప్రారంభం

చొప్పదండి, జూన్ 19: చిట్యాలపల్లిలో జడ్పీ ప్రత్యేక నిధులు రూ. లక్షాపదివేలతో చేపట్టిన బోర్‌వెల్ పనులను జడ్పీటీసీ మాచర్ల సౌజన్య–వినయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గుంట రవి, నాయకులు మధు, మనోహర్, తిరుపతి, మల్లేశం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముకాస ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విద్యానగర్, జూన్ 19: తెలంగాణలో మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం జిల్లా ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు సత్తినేని శ్రీనివాస్, బొల్లం లింగమూర్తి, దామెరకొండ సంతోష్‌కుమార్, తోట కోటేశ్, వరప్రసాద్ బట్టు, పెంట అజయ్‌పటేల్, కుమార్, బోనాల సంపత్, గాండ్ల రమేశ్, శ్రీకాంత్, పసుల్ల మైపాల్, రాజయ్య, అనిల్, హరిణి రేణుక, అజంత, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి, జూన్ 19: తెలంగాణ మున్నూరుకాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం మండలాధ్యక్షుడు గాండ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రజితకు వినతిపత్రం అందజేశారు. సంఘం పట్టణాధ్యక్షుడు మరిమడ్ల రాజుపటేల్, యువజన విభాగం అధ్యక్షుడు చుక్క ప్రవీణ్, సత్తు తిరుపతి, రవి, పబ్బ శ్రీను, పబ్బ సత్యం, అమిరిశెట్టి రామయ్య, గంగారెడ్డి, సాగర్, సతీశ్, శేఖర్, గౌరి, అంజయ్య, కిషన్, మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

గంగాధర, జూన్ 19: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మడ్లపెల్లి శ్రీనివాస్ తెలిపారు. ముకాస నాయకులు మడ్లపెల్లి గంగాధర్, సామంతుల శ్రీనివాస్, దొడ్ల ఎల్లారెడ్డి, రుద్రాక్ష శ్రీనివాస్, కట్ల శ్రీనివాస్, నలువాల సత్తయ్య, ఆకుల మనోహర్, అల్లం ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు

## గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 19: పట్టణంలోని యాదవులకు రెండో విడుత గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని యాదవ సంఘం పట్టణాధ్యక్షుడు సందబోయిన ప్రసాద్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని పట్టణ యాదవ సంఘ కార్యాలంయలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు జంగ కొమురయ్య, ప్రణయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

కమాన్‌చౌరస్తా, జూన్ 19: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ అప్పారావు తెలిపారు. 1413 మందికి 1327 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన విద్యార్థులు మంగళవారం హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

## నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 19: నగరంలో మంగళవారం తీగల వంతెన పనులు, విద్యుత్ లైన్ల మెయింటనెన్స్, తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆటోనగర్, కోతిరాంపూర్, పోచమ్మవాడ ప్రాంతాలకు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–1 ఏడీఈ నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు అందజేత

గంగాధర, జూన్ 19: గంగాధర పీహెచ్‌సీలో సోమవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను వైద్యాధికారి వెంకటేశ్ అందజేశారు. ఇక్కడ వైద్యాధికారి ప్రత్యూష, హెల్త్ సూపర్‌వైజర్లు పోచయ్య, మెర్సి, ప్రశాంతి, జాకీర్, సీహెచ్‌వో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం 16k to 18k ఏజెంట్ కమీషన్ 3k, Ph: 9640258899, 9640468899.
NT-307988-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194